# గాస్పల్ అసెంబ్లీ అనంతపురం.

## 1925- 2005

(అనంతపురములో
80 ఏండ్ల సేవ
ముగిసిన సందర్భమున
ప్రచురించబడుచున్నది)



గాస్పల్ అసెంబ్లీ పబ్లిషింగ్స్
7-270 కోర్టురోడ్డు, అనంతపురం - 1,
ఫోన్ : 08554 275070.

# గాస్పల్ అసెంబ్లీ

అనంతపురం

1925-2005

(అనంతపురంలో 80 ఏండ్ల సేవ ముగిసిన సందర్భమున
ప్రచురించబడుచున్నది)

గాస్పల్ అసెంబ్లీ పబ్లిషింగ్స్
# 7-270, కోర్టురోడ్డు, అనంతపురం - 1
ఫోను: 08554 -275070

# గాస్పల్ అసెంబ్లీ, అనంతపురం

1925-2005

అనంతపురంలో 1925 సం॥ డిసెంబర్ నెలలో మొదటి రొట్టె విరచు ఆరాధన కూడిక జరిగి దైవజనులు అగ్రిప్ప, ఫాక్సుగారలచే స్థానిక సంఘము ప్రారంభించబడినది.

దైవజనులు సైలస్ ఫాక్సు గారు 1893 లో కెనడాలో జన్మించి 1912 లో యేసుప్రభువును రక్షకుడుగా అంగీకరించిరి. ఆత్మలరక్షణ భారము కలవాడై తనకు వివాహమైన రెండవ దినమున కెనడాదేశము వదలి 1917వ సంవత్సరము ఇండియాకు వచ్చిరి. అనంతపురం జిల్లాలో సి.ఐ.జి. మిషన్‌లో 1917 నుండి 1925 వరకు సువార్త సేవచేసిరి. ఈ దినములలో సి.ఐ.జి. మిషన్‌లో పనిచేయు అగ్రిప్ప గారను సేవకునితో పరిచయము ఏర్పడినది. వారిద్దరి మధ్య పరిచయము సహవాసముగా మారి విడదీయరాని బంధమేర్పడినది. పౌలు - తిమోతివలె, పౌలు-బర్నబావలె కలసి ముందుకు సాగిరి.

మిషన్ కట్టడల క్రింద సేవలో స్వాతంత్ర్యము లేదని గుర్తించి ప్రభువుమీద ఆయన వాక్యము మీద ఆనుకొని సేవచేయ నిశ్చయించుకొనిరి.

1925 ఆగష్టు నెలలో సి.ఐ.జి. మిషన్ పనికి ఫాక్స్‌గారు రాజీనామా చేసిరి. ఫాక్స్‌గారు చేసిన పని సరిగానున్నదని గుర్తించిన అగ్రిప్ప గారును సి.ఐ.జి. మిషన్ పనికి రాజీనామా చేసిరి. అనంతపురంలో మొదట అగ్రిప్పగారి ఇంటిదగ్గర ఒక చెట్టుక్రింద ఆరాధన కూటము జరిగినది. క్రమేపి ఒక చిన్న గుంపు ఏర్పడెను. వారమునకు నాలుగైదు పర్యాయములు వాక్యపారాయణము చేయుచు సహోదరులు ముందుకు సాగిరి. ఇది దక్షిణ ఆంధ్రలో ఏర్పడిన మొదటి బ్రదరన్ సంఘముగా గమనించగలము.

దీని పూర్వపుచరిత్ర ఫాక్స్‌గారి మాటలలో విందాము (ఇంగ్లీషులో ఫాక్స్ గారి చరిత్ర 70వ పేజీ నుండి)

"నేను మిషన్‌లో ఉండగ సేవలో ఆతురత కలిగి మద్రాసు పట్టణపు వీధులన్నిటిలోను సువార్త ప్రకటించుచూ, కరపత్రములను పంచుచున్న హెండ్లీబర్డ్ అను ఆంగ్లేయ దొరగారిని గూర్చి వింటిని. వారిని పరిచయము చేసుకొనుటకై తీర్మానించుకొంటిని.

ఒకనాటి ఉదయం కలకత్తా మెయిలులో మద్రాసు చేరి హేండ్లీ బర్డ్ నివసించుచున్న గది వద్దకు వెళ్లితిని. వారు నా కొరకై కనిపెట్టుట లేదు కానీ నేను తలుపుతట్టగానే తలుపుముందు నిలబడి వున్న సన్యాసివంటి కాషాయ వస్త్రమును ధరించియున్న తెల్లనివ్యక్తినైన నన్ను చూచి మీరెవరని ప్రశ్నించిరి. దేవుని సేవకుడనని జవాబిచ్చితిని. గదిలోనికి రమ్మని ఆహ్వానించి అల్పాహారము నిచ్చిరి. ఆ దినమే హేండ్లీబర్డ్‌గారు, నేను మద్రాసు పట్టణపు వీధులలోనికి వెళ్లి తెలుగు వారి మధ్య సువార్తను ప్రకటించితిమి. వారితో కొన్ని దినములు గడిపి ఒకరి ద్వారా ఒకరము సంతోషించితిమి. ఈ మా మొదటి పరిచయం ఒక గాఢమైన బాంధవ్యముగా మారి తర్వాత అనేక సంవత్సరముల వరకు పలుమారులు మద్రాసుకు వెళ్లి వారితో కలసి సువార్త కూడికలను జరిగించుటకును, ఆత్మలు సంపాదించుటకును తోడ్పడినది. ఆ దినములలో హేండ్లీబర్డ్‌గారు మద్రాసులో ఒక ఇంటిని అద్దెకు తీసికొని ఇంటిపైన గడ్డితో కప్పబడిన అతి సామాన్యమైన గదిలో నివసించుచుండిరి. క్రింది అంతస్తులోనున్న ఇంటిని సంఘము కూడుకొనుటకును, మద్రాసుకు చదువు నిమిత్తము, ఉద్యోగముల నిమిత్తమును వచ్చు యవ్వనస్థుల నివాసముగను వాడుచుండెను. ఈ రీతిగా యవ్వన సహోదరులను క్రైస్తవ ప్రేమలోను, శిష్యత్వములోను తర్ఫీదు చేయువాడు. పట్టణములోని భయంకరమైన పరిస్థితుల నుండి వారిని కాపాడుట యందు ఆశ కలిగియుండెను. (మేము కలసి పాల్గొనిన మొదటి రొట్టె విరుచు ఆరాధన

క్రమము నందు నేనేమైనా మాటలాడవలెనా? అని హేండ్లీబర్డ్ గారిని అడిగితిని. జవాబుగా - ఫాక్స్‌గారూ! మీ మాటలు వినుటకై మేమిక్కడికి రాలేదు. అందరికంటే ప్రముఖమైన ప్రభువైన యేసుకొరకు ఇప్పుడు మనము ఎదురు చూడవలయుననిరి. హేండ్లీబర్డ్ గారి, ఇటువంటి స్వేచ్ఛతో కూడిన రొట్టెవిరుచు ఆరాధనాక్రమము నన్నెంతో ఆకర్షించినది. హేండ్లీబర్డ్‌గారి జీవితము, సేవ, నా సేవాజీవితముపై ఎంతో ప్రభావమును కలిగించినవి. మా మధ్య పౌలు - తిమోతిల బాంధవ్యమేర్పడెను. హేండ్లీబర్డ్ గారి నుండి అనేకమైన సంగతులు నేర్చుకొంటిని" ఫాక్స్ గారిని ఆకర్షించిన స్వేచ్ఛతో కూడిన ఆరాధన క్రమమును హేండ్లీబర్డ్‌గారు 1832 లో జార్జిముల్లర్ తదితర సహోదరులను మధ్య పెల్లుబికిన సహోదరుల ఉద్యమము "బ్రదరన్ మూమెంట్" నుండి నేర్చుకొనిరి. 1830కి పూర్వము క్రైస్తవ విశ్వాసులు ప్రతి ఆదివారము కాక అప్పుడప్పుడు రొట్టెవిరుచు క్రమము కలిగి వుండిరి. అభిషేకించబడిన గురువులు (ప్రీస్ట్) ఈ రొట్టె విరుచు కార్యక్రమము జరిగించుచుండిరి. ఇతరులకు ఇందులో స్వేచ్ఛలేదు. మొదటి శతాబ్ది క్రైస్తవుల వలె నిరాడంబర ఆరాధన లేదు. నిర్ణీత జీతములు గురువులకు సంఘ సేవకులకు ఇవ్వబడుచుండెను.

అదేసమయంలో పరిశుద్ధాత్మ దక్షిణ అమెరికా మొదలు రంగూన్, ఇండియా వరకు 1812 నుండి 1825 మధ్యకాలములో ఆత్మీయుల మధ్య వాక్యానుసారమైన సహవాసము అను అంశముపై ఉత్తరములు వ్రాసుకొనుట జరిగెను. వీరిలో కొందరు సహోదరులు 1825 ఐర్లాండ్‌లోని డబ్లిన్ పట్టణములో మొట్టమొదటిగా ప్రతి ఆదివారము రొట్టె విరుచుటకు ప్రారంభించిరి. ఈ దినములలోనే దాదాపు ప్రపంచపు నలుమూలలనుండి 100 మందికి పైగా ప్రాముఖ్యమైన సహోదరులు వాక్యముద్వారా ఒప్పించబడి ప్రతి ఆదివారము రొట్టెవిరుచుటకు కూడుకొనుట అనేక పట్టణములలో ప్రారంభించిరి. ఎడ్వర్డ్ క్రానిన్ గారు, గ్రోవ్స్‌గారు ఎక్సిటర్‌లోనూ, పిదప

సెయింట్ ఆంధ్రాస్‌లోనూ, ప్లిమత్‌లోనూ ఈ విధముగానే కూడుకొనుట ప్రారంభించిరి.

వీరిలో కొందరు తమవలె ఇతర స్థలములలో కూడుకొనుచున్నారని తెలియకనే తమంతటతాము పరిశుద్ధాత్మ ద్వారా నడిపింపబడి ప్రారంభించి కొన్ని సం॥లు ముందుకుసాగిరి. ఈ దినములలోనే జార్జి ముల్లర్‌గారు పరిశుద్ధాత్మ ద్వారా నింపబడి ప్రతి ఆదివారము రొట్టె విరుచుటకు ప్రారంభించెను. ఈ కూడికలో నడిపించువారు పరిశుద్ధాత్ముడు తప్ప మరి ఎవ్వరు వుండరు. పలు ప్రాంతములలో సహోదరులకు మధ్య పెల్లుబికిన ఈ ఉద్యమము సహోదరుల ఉద్యమము అని పిలువబడినది. (బ్రదరన్ మూమెంట్) ప్లిమత్ పట్టణములో సహోదరులు కూడుకొను ఈ సహవాసము ప్లిమత్ బ్రదరన్ పేరుతో వృద్ధి చెందినది. జార్జిముల్లర్‌గారు 1832లో హెన్రీక్రాక్ గారితో బ్రిస్టల్ పట్టణమురాగా తమ వాక్యపరిచర్యను ప్రేమించు ఒక వ్యక్తి తమ కొరకు ఒక స్థలమును అద్దెకు తీసుకొనెను. ప్లిమత్ పట్టణములోవలె ప్రతి ఆదివారము రొట్టె విరుచుటను ప్రారంభించిరి. నిర్ణీతమైన జీతము లేకయే పనిచేయుచుండిరి. మందిరమునకు గాని, మందిరములోని కుర్చీలకుగాని ఎలాంటి రుసుము వసూలు చేయకుండ పనిచేయుటచే అనేకులు వారితో కలసికొని సంఘ సహవాసములో ముందుకు కొనసాగిరి. ఆ సంఘము బెతెస్థా అను పేరుతో పిలువబడెను. సంఘములకు ఆయన ఇచ్చు హెచ్చరికలు.

1) సంఘములో ఆరాధన, రొట్టె విరుచుట మొదటి శతాబ్దపు క్రైస్తవుల వలె నిరాడంబరముగా నుండాలి.

2) సంఘ సేవకులను, యాజకులని (ప్రీస్ట్) అభిషేకించుట, నియమిత జీవితములిచ్చుట వాక్యానుసారము కాదు.

3) సంఘ పెద్దలు పరిశుద్ధాత్మపూర్ణులై వుండాలి.

పై విషయములు వాక్య సత్యములని ఒప్పించబడిన ఫాక్సుగారు, అగ్రిప్పగారు 1) మొదటి శతాబ్దపు క్రైస్తవుల వలె నిరాడంబరముగా రొట్టె విరుచు కార్యక్రమమును అనంతపురంలో అగ్రిప్పగారి పూరింటిలో జరిపించు చుండిరి. 2) మిషన్ పనికి రాజీనామా ఇచ్చినందున వారికి నియమిత జీతము లేదు. ఇంగ్లాండు దేశములోని బాత్ పట్టణమందున్న బ్రదరన్ సంఘమువారు "ఎకోస్ ఆఫ్ సర్వీసు" అను ఇంగ్లీషు మాసపత్రిక యందు సేవకొరకు ప్రత్యేకించబడిన సేవకుల పేర్లు ప్రచురించుచుండిరి. అందులో ఫాక్సు గారి పేరు చేర్చబడి క్రమముగా ఫాక్సు గారికి సహాయము పంపబడుచుండెను. దీనియందు ఫాక్సు గారి సేవపై ఎటువంటి పెత్తనము వారు చెలాయించు విధానవేమియు లేదు. అయినను ప్రభువు సహాయమునకు అప్పగించుకొనిన ఫాక్సు గారికి అటువంటి క్రమముగా సహాయము పంపబడుపట్టిలో తన పేరుండుట ఇష్టములేక తన మనసులో కొంతపోరాటము జరిగిన తర్వాత తన పేరును ఆ పట్టి నుండి తొలగించుకొనెను. ఫాక్సు గారికి అపుడు సంపూర్ణ సమాధానము దొరికినది అని ఇంగ్లీషులో ప్రచురించబడిన ఫాక్సు గారి జీవిత చరిత్ర పుస్తకము 63వ పేజీలో వ్రాయబడినది. 3) సంఘ సేవకులు పెద్దలు పరిశుద్ధాత్మపూర్ణులై యుండి, పరిశుద్ధాత్మునిపై ఆధారపడవలెను. ఫాక్సుగారిని మీరు ఇండిపెండెంట్ బోధకులా (ఎవరిమీద ఆధారపడని బోధకులా) అని కొందరు అడిగిరి కాని ఆయన నేను దేవుని మీద, పరిశుద్ధాత్ముని మీద, ఆయన వాక్యము మీద ఆధారపడువాడనని చెప్పువాడు.

ఇటువంటి సేవా విధానము సేవకై ప్రత్యేకించబడిన నిర్ణీత జీతములేని వారికి కష్టతరము. అందువలన ఫాక్సు గారికి, అగ్రిప్పగారికి కుటుంబ పోషణ, పిల్లల చదువుల కొరకైన ఖర్చులు, పిల్లల బట్టలు వారికి భారముగా నున్నను ప్రభువు వారిని ఆదుకొనెను. ఫాక్సుగారు తనకు వచ్చు సహాయములో నుండి అప్పుడప్పుడు అగ్రిప్పగారికి సహాయము చేయువారు.

అనంతపురం సంతలోను, వీధులలోను బజారులలో క్రమముగా సువార్త ప్రకటన జరుగుచుండెను. ఆదివారము వీధులలో సువార్త ప్రకటింప బడుచుండగా అనేకులు ప్రశ్నించి వాదించు చుండిరి. వారికి జవాబిచ్చిన పిదప సాయంత్రము మందిరము కొరకు బాడుగకు తీసికొనిన ఇంటివద్దకు వచ్చి నిరాడంబరముగా పైన వివరించిన రీతిలో ప్రభురాత్రి భోజన కార్యక్రమము చీకటిపడిన తరువాత జరిపించుచుండిరి. రానురాను సహోదరీల అనుకూలత కొర్కై ఈ సంఘమందు ఆదివారము ఉదయం సువార్త కూడిక జరిగిన తరువాత రొట్టె విరుచు క్రమము ఏర్పడెను. చదువుల నిమిత్తము, ఉద్యోగముల నిమిత్తము, ఆయా ప్రాంతముల నుండి వచ్చిన యవ్వనులు ఈ సహవాసము ఒక బైబిల్ స్కూలుగా నుండవలెనని ఆశించిన ఫాక్సు గారు ఆరాధన కూడిక జరుగు ఈ బాడుగ ఇంటిలో బైబిల్ తరగతులు జరిగించుచూ ఈ మందిరమునకు బైబిల్ స్కూలు అను పేరు పెట్టిరి.

ఈ సంఘము నుండి ఫాక్సుగారు, అగ్రిప్ప గారు కేరళలోను బొంబాయిలోను చేసిన సేవా విరములు గమనించగలరు.

<u>కేరళ:-</u> ఒకమారు ఫాక్సుగారు అనంతపురం నుండి వెళ్లి కేరళలో ఉజ్జీవసభలు జరిపించుచుండగా 'కురియన్' గారను ఒక సహోదరుడు మళయాళం భాషలోనికి అనువాదము చేయుచుండిరి. "అప్పుడు నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని. అంతట - నేను చిత్తగించుము నేనున్నాను నన్ను పంపమనగా'' మా నిమిత్తమై ఎవడుపోవును అని ఆయన బహిరంగముగ సవాలు చేసెను. జవాబుగా భాషాంతరము చేయుచున్న కురియన్ గారు దేవుడు ఈ మాట తనతోనే మాటలాడినట్టు గమనించి "నేనున్నాను. నీ సేవకై నన్ను పంపుము ప్రభువా!'' అనిపలికెను. సహోదరుడు కురియన్ గారితో దేవుడు తన సేవకొర్కై ముందుకు రావలెనని ప్రేరేపించగా మునుపు తాను దేవుని పిలుపునకు

విధేయత చూపలేదని ఇప్పుడు విధేయత చూపుచున్నానని తెలిపిరి. తాను పంచదార కర్మాగారములో మంచి ఉద్యోగము చేయుచుండెను. ఈ మారు దేవుని పిలువును ఎదిరించలేక విధేయత చూపి ఉద్యోగమునకు రాజీనామా చేసి సేవకై తన జీవితమును సమర్పించుకొనిరి.

మరొకసారి అనంతపురం నుండి కేరళకు వెళ్లి ఫాక్సు గారు ఉజ్జీవసభలలో II రాజులు 6:6 పై ఇనుము నీటిపై తేలగలదా అను అంశముపై ప్రసంగించు చుండిరి. "ఆ దైవజనుడు - అదెక్కడ పడెనని అడిగెను; వాడు అతనికి ఆ స్థలమును చూపింపగా కొమ్మయొకటి నరికి నీళ్లలోవేయగా గొడ్డలి తేలెను."

ఆ కూడికలో 'తమిల్ డేవిడ్' అను ఒక సేవకుడు వాక్యము వినుచుండెను. గతంలో ఈ తమిల్ డేవిడ్ గారు సిరియన్ క్రైస్తవుల మధ్య గొప్ప సేవను చేసి సుమారు 30 వేల మందిని ప్రభువు యొద్దకు నడిపించియుండిరి. అప్పుడు ఆత్మీయ జీవితములో చల్లారి సుమారు ఏడేండ్లు సేవలో వెనుకబడియుండెను. ఆ సమయములో అతడు ఫాక్స్‌గారి ప్రసంగమును వినుచుండెను. ఆ సమయములో ఆయన ప్రవక్తల శిష్యుడు నీటిలో పోగొట్టుకొనిన ఇనుపగొడ్డలి, ప్రవక్త ఆజ్ఞమేరకు నరుకబడిన కొమ్మ నీటిలో వేయబడగా గొడ్డలి తేలెననియు, ఆ శిష్యుడు చేయి చాపి గొడ్డలిని పట్టుకొనెననియు ప్రకటించుచుండిరి. ప్రవక్త శిష్యుడు పోగొట్టుకొనిన ఆ గొడ్డలి విశ్వాస జీవితము అనియు గొడ్డలి నీటిలో మునుగుట అనగా విశ్వాస జీవితములో వెనుకబడుట అనియు బోధించెను. నరుకబడిన కొమ్మలేని యెడల ఇనుపగొడ్డలి నీటిలో తేలుట అసాధ్యమని బోధించిరి. నరుకబడిన ఈ కొమ్మ సర్వలోకము నిమిత్తము వధించబడిన ప్రియ ప్రభువైన 'యేసుక్రీస్తు' అనియు, ఆయననుబట్టి ఆత్మీయ జీవితములో చల్లారినవారు తిరిగి పైకి లేవవచ్చునని బోధించుచుండిరి. ఈ మాటలు వినుచున్న తమిల్ డేవిడ్ గారు విశ్వాసముతో ప్రభువైన యేసువైపు చూచి తన వెనుకబడిన జీవితము

విషయమై పశ్చాత్తాపపడి తన జీవితమును నూతనముగా ప్రభువుకు సమర్పించుకొని ప్రభువు సేవలో ముందుకు సాగెను.

**బొంబాయిలో మంటలు .... మంటలు**

1935 హేండ్లీబర్డ్ గారు బొంబాయిలో నుండగా అనంతపురం నుండి ఫాక్స్‌గారు సేవకై బొంబాయి వెళ్ళిరి. ఒక గదిలో ఆరాత్రివేళ యూదా పత్రికలోని 23వ వచనముపై అగ్ని అను మాట మీద ప్రసంగించుచుండిరి. బైబిలులలోనున్న మూడు రకములయిన, అగ్నిలను గురించి మాటలాడుచుండిరి. అందులో మొదటిది - 'హృదయముననున్న అగ్ని' అనగా దురాశలనియు, రెండవ అగ్ని - 'నాలుక' అనియు, మూడవది - 'నరకాగ్ని' అనియు బోధించుచుండెను. నరకాగ్ని యొక్క భయంకరత్వమును గురించి వివరించుచూ తన ముందున్న కుర్చీపై ఆనుకొని "మంటలు.... మంటలు...." అని అరుచుచుండిరి. ఆ శబ్దమునకు కూడికలో వుండువారిలో ఏ ఒక్కరు నిద్రమత్తులు కాక అందరూ ఆశ్చర్యచకితులై, ఏమి జరుగునోయని గమనించుచుండిరి.

ఆ అరుపులకు వీధిలో నివసించువారు అగ్నిమంటలు నిజముగా వ్యాపించినవేమో అని తలంచి అగ్నిమాపక దళము వారికి తెలియపరచిరి. ఆ గది చుట్టుప్రక్కల నివసించు ప్రజలు కూడా ఆ గదిలో నిజముగా అగ్నిమంటలు వ్యాపించుచున్నవని తలంచి మంటలు ఎక్కడ వున్నవోనని గమనించుచుండిరి. కానీ ఆయన ఇంకను "మంటలు... మంటలు" మంటలు అని అరచుట మానలేదు. అప్పుడు దైవజనుడైన హేండ్లీబర్డ్ గారు అగ్ని మంటల తీవ్రత ఎంతో గొప్పదనియు ప్రతి ఒక్కరు, ప్రతిమానవుడు దేవునితో సమాధానపడవలసిన సమయము ఆసన్నమైనది అని వివరించిరి. అదే సమయానికి బొంబాయి పట్టణపు అగ్నిమాపకదళము వారు యంత్రముతో సహా ఆ స్థలమునకు చేరి ఎక్కడ అగ్నిమంటలు వ్యాపించి యున్నవోనని పరీక్షించుచుండిరి. కానీ నిజమైన అగ్నిమంటలు అక్కడలేవని

నరకాగ్నియొక్క తీవ్రతను గురించిన బోధ అక్కడ చేయబడుచున్నదని తెలిసికొని ఆశ్చర్యచకితులై అక్కడ నుండి వెళ్లిపోయిరి.

మరుసటి దినము బొంబాయి పట్టణపు వార్తాపత్రికలన్నీటిలోనూ 'అగ్నివంటి అమెరికా దేశపు దేవుని సేవచేయు సువార్తికుడు, బొంబాయి అగ్నిమాపకదళం వారిని పిలిపించెను' అను వార్తను ప్రచురించిరి. ఈ వార్తద్వారా ఆయన ఒక శక్తి గల ప్రసంగీకుడని బొంబాయి పట్టణములోని వారందరు గుర్తెరిగి తరువాత కాలములో బొంబాయి పట్టణములో జరిగిన ప్రత్యేక సభలకు బహుమంది జనము ఆకర్షింపబడిరి. బొంబాయి పట్టణమునకు అగ్రిప్ప గారు, ఫాక్సు గారు తరచుగా వెళ్లి సేవ చేయుచుండిరి.

అనంతపురంను కేంద్రముగా చేసికొని ఆంధ్రప్రాంతమంతయూ సంచరించుచూ దేవుని సేవ చేయుచుండిరి. ఫలితముగా ఆంధ్రలోని పలు జిల్లాలలో అనేక సంఘములు ఏర్పడినవి.

అనంతపురం చుట్టుప్రక్కల గల గ్రామములకు కాషాయ వస్త్రములను ధరించుకొని ఫాక్సు గారు తంబురను వాయించుచూ, పాటలు పాడుచూ సువార్తను బోధించువారు. అనంతపురంలో సంఘమును దైవజనులైన ఫాక్సు గారు, అగ్రిప్పగారును కలసి క్రొత్తనిబంధన సత్యముల ప్రకారము కట్టుచుండిరి మరియు యవ్వనస్తులను తమ స్వంత బిడ్డలవలె చూచుకొనుచూ "మా బిడ్డలు ఇప్పుడు దూరముగానున్నారు. మీరే మా బిడ్డలు" అనుచుండిరి. ఆయన అనుదినము యవ్వనస్తులకు వాక్యము నేర్పించుచుండిరి.

మరియవలె యేసు పాదములయొద్ద కూర్చుని అనంతపురము సంఘములో దేవుని వాక్యమును నేర్చుకొనిన యవ్వనులు ఇప్పటికిని ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇతర రాష్ట్రములలోనూ పలుప్రాంతములకు చెదరి సంఘముల విషయము, సేవల విషయము బాధ్యతగల్గి ప్రభువును

సేవించుచున్నారు. అటువంటి వారిలో కొద్దిమందిని గూర్చి చివరి పేజీలలో వివరణ ఇవ్వబడినది.

అనంతపురంలో నుండి పల్లెలలోనూ, పట్టణములలోనూ, సంఘములలోనూ ఫాక్సుగారు చేసిన పరిచర్య ఫలించి వ్యాపించుటనేటికిని మనము చూడగలము.

జి.యస్. జోసఫ్ గారు 1939లో రక్షింపబడిరి. అనంతపురంలో ఫాక్సు గారు అగ్రిప్పగారి సహవాసములో నుండగా సేవ కొరకు ప్రత్యేకించ బడవలెనన్న వారి ఆశయమును దృఢపరుచుకొనిరి. జోసఫ్‌గారు తండ్రి సమ్మతితో 1944లో గవర్నమెంట్ రెవిన్యూ డిపార్టుమెంటు పనికి వెంటనే రాజీనామా ఇచ్చుటకు సాహసించలేక సెలవు తీసికొని అనంతపురమునకు సతీమణితో వచ్చి ఈ సంఘమందు సువార్త సేవ, సంఘ పరిచర్య జరిగించు చుండిరి. 1945 జనవరిలో ప్రభుత్వపనికి రాజీనామా ఇచ్చి ఫాక్సుగారితో కలసి ఆంధ్రప్రదేశ్‌లోను, కర్నాటక రాష్ట్రములోను పలు ప్రాంతములలో సువార్త పని జరిగించిరి. ఆదినములలో యస్. ప్రభుదాస్‌గారు, పాల్‌గుప్తగారు, నాయుడు పేట జాకబ్‌గారు బిట్రగుంట ఐజక్‌గారు అనంతపురం స్థానిక సంఘములోనుండగా జోసఫ్‌గారు వారితో కలసి ప్రభువు సేవలో పాల్గొనిరి. జోసఫ్ గారు ఫాక్సు గారితో కలసి 25 సంవత్సరములు సేవ జరిగించిరి. ఈ సంఘము నుండి ఫాక్సు గారిచే 1925 నుండి 1975 వరకు క్రైస్తవ నిరీక్షణ అను మాసపత్రిక ప్రచురింపబడి వేల కొలది మందికి ఆశీర్వాదకరముగా వుండినది. జోసఫ్ గారు అనేక సంవత్సరములు ఆ పత్రిక సహాయసంపాదకులుగా నుండి ప్రచురించు బాధ్యత నెరవేర్చిరి. పోలీసు డిపార్టుమెంటులో పనిచేసిన 1) జార్జి పాల్‌గారు, 2) పెద్ద ఐజయ్యా గారు 3) చిన్న ఐజయ్యా గారు అగ్రిప్ప గారితో, ఫాక్సు గారితో కలసి సువార్త సేవలో పాలుపొంది మంచి సాక్ష్యము కలిగి ప్రభువు నందు నిద్రించిరి. 1957వ సంవత్సరము వరకు వృద్ధియైన సంఘము 1957 - 75 మధ్య రెండు వేరు,

వేరు స్థలములలో 1) బైబిల్ స్కూలు సంఘముగాను, 2) గాస్పల్ హాలు సంఘము గాను బాడుగ ఇండ్లలో కొనసాగినవి. దేవుని సేవకులు అగ్రిప్పగారు 1967వ సం॥ ఫిబ్రవరి 24వ తారీకున ప్రభువు నందు నిద్రించిరి. తదుపరి సాయినగర్‌లో స్థిరమైన స్థలమందు బైబిల్ స్కూలు సంఘము కొనసాగు చున్నది. ప్రస్తుతము మంచి భవనము కట్టబడి అందులో సంఘము చక్కగా సాగుచున్నది. గాస్పల్ హాలు సంఘము కోర్టురోడ్డు నందలి మధ్యభాగములో స్థలము కొని సైలస్ ఫాక్సు మరియు ఎమ్మా మెమోరియల్ చర్చి నిర్మించబడి అందులో గాస్పల్ అసెంబ్లీ అనుపేరుతో సంఘము కొనసాగుచున్నది. ఫాక్సు గారి భార్య 1981లోను, ఫాక్సుగారు 1982 మే నెలలోను కెనడా దేశమందు ప్రభువు నందు నిద్రించిరి. ప్రభువు కృపను బట్టి 1992లో స్థిరమైన కట్టడము (చర్చి) నిర్మించబడి ఫాక్సు గారి పెద్దకుమారుడైన డొనాల్డ్ ఫాక్సు గారిచే ప్రతిష్టించబడినది.

ఈ సంఘము ద్వారా జరుగు సేవ:

1) ఆదివారము ఐదువందల మంది వరకు సువార్త కూడికకు ఉదయం 9 గం॥ నుండి 11 గం॥ వరకు కూడెదరు. తరువాత 300 మంది వరకు ఆరాధనలో 11 గం॥ నుండి 12 గం॥ వరకు పాల్గొనెదరు.

2) ఆదివారము ఉదయం 10 గం॥ నుండి 11 గం॥ వరకు చిన్నపిల్లలకు ప్రత్యేకముగా వాక్యము నేర్పించబడును. (సండే స్కూలు)

3) ఆదివారము సాయంత్రం 4 గం॥కు సహోదరులు చుట్టు ప్రక్కల పల్లెలకు సువార్త ప్రకటనకు వెళ్లెదరు.

4) ఆదివారము సాయంత్రము 5 గం॥ స్త్రీల కొరకైన ప్రత్యేక కూడిక జరుగును. వాక్యమందు అనుభవము గల సోదరీలు వాక్యపరిచర్య చేయుదురు. ప్రతి రెండవ శనివారము పగలంతయు స్త్రీలు ఉపవాస ప్రార్థనలో గడుపుదురు.

5) సోమవారము సాయంత్రము మెడికల్ కాలేజి విద్యార్థి, విద్యార్థినులకు వాక్య పరిచర్య జరుగును.

6) ప్రతి మంగళవారము సాయంత్రం 6-30 గం॥ బైబిల్ పారాయణము, గురువారము సాయంత్రము 6-30 గం॥ బైబిల్ పారాయణము లేదా గృహ కూడిక జరుగును.

7) ప్రతి శుక్రవారము సాయంత్రము 6-30 గం॥సంఘము ప్రార్థనకై కూడి వచ్చెదరు.

8) ప్రతి శనివారము సాయంత్రం 6 గం॥కు యువతీ యువకులకు, యౌవ్వనస్థుల కూడిక జరుగును.

9) సంఘము ద్వారా ఇంజనీరింగ్ కాలేజి పరిసరములలో బాడుగ ఇంటిలో విద్యార్థులకు, హాస్టల్‌లో విద్యార్థినులకు వాక్యము నేర్పించబడును.

10) ప్రతి దినము ఉదయము 6 గం॥ నుండి 7 గం॥ వరకు బైబిల్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు పట్టణ వీధులలో సువార్త ప్రకటించెదరు.

11) ప్రతిదినము సాయంత్రము సహోదరీలు అనంతపురం పట్టణమందు ప్రాంతముల వారిగా కొద్దిమంది సోదరీలను సమకూర్చి, సువార్త ప్రకటన, వాక్యధ్యానము చేయుదురు. దీనిఫలితముగా అనేకులు రక్షించబడి సంఘములో చేర్చబడు చున్నారు.

12) సంఘములోని గిడియన్ సభ్యులు క్రమముగా అన్ని పాఠశాలలలోను, కళాశాలలలోను క్రొత్త నిబంధనలను పంచుచున్నారు. ప్రతి శనివారము సాయంత్రము గిడియన్ సభ్యులు ప్రార్థనకై మందిర ఆవరణమందు కలిసికొందురు.

13) ప్రతి ఆదివారము జిల్లా జైలులోను, ఓపన్ ఎయిర్ జైలులోను సంఘ పెద్దయగు పి. అబ్రహాము గారి ద్వారా సువార్త ప్రకటింపబడినది. దీనిఫలితంగా 22 మంది ప్రభువును నమ్మి బాప్తిస్మము పొందిరి.

14) ప్రతి సంవత్సరము పిల్లలకు మే నెలలోను, యువనుల కొరకు (యూత్‌క్యాంప్) అక్టోబరు నెలలోను, స్త్రీల కొరకు జనవరి నెలలోను ప్రత్యేక సభలు జరుగును.

15) అనంతపురంలోని క్రైస్తవులు క్రైస్తవేతరులైన అధికారులకు, ముఖ్యముగా ఇంగ్లీషు భాష నెరిగిన వారికి డిసెంబర్ మాసములో చాలా సంవత్సరములుగా తాలూకా ఆఫీసు కాంపౌండులో బహిరంగ కూడిక జరిపించబడెను. దీనికి జిల్లా కలెక్టర్లు, జిల్లా జడ్జీలు, వైస్ ఛాన్స్‌లర్లు, జిల్లా పోలీస్‌సూపరింటెండెంటులు అధ్యక్షత వహించిరి.

16) ఈ సంఘము ద్వారా జరిగిన పరిచర్యచే భారతదేశములోని అనేక రాష్ట్రములలో సంఘములు ఏర్పడుటేకాక అనంతపురం జిల్లాలోని అన్ని తాలూకాలలోరమారమి 70 సంఘములు ఏర్పడినవి. 30 సంఘములకు స్థిరమైన కట్టడములు కట్టబడినవి. ఈ సంఘమందు రక్షించబడిన వారి ద్వారా హైదరాబాద్ పట్టణమందు నాలుగు సంఘములు ఏర్పడినవి.

17) ఫాక్సు గారు అనంతపురం నందున్న సహవాసము సేవకులకు తర్ఫీదు నిచ్చు బైబిల్ స్కూలుగా నుండవలెననెడి ఆశ కలిగి యుండిరని ముందుగా చూచితిమి. ఆ భారము సంఘము కలిగివుండి సంఘము తరపున ఆ పరిచర్య చేయు బాధ్యతను సహో॥వరప్రసాదరెడ్డి గారికి అప్పగించిరి. 1999 సం॥ నుండి ప్రతి సంవత్సరము 10-12 మంది చొప్పున నేటికి 70 మంది వాక్యతర్ఫీదును పొందిరి. వాక్య అనుభవము గల దైవసేవకులు ఆయా ప్రాంతముల నుండి వచ్చి విద్యార్థులకు వాక్యమును క్రమముగా నేర్పించుచున్నారు. వారు ఆ దినములలో సంఘకూడికల యందును వాక్యపరిచర్య చేయుదురు. సంఘ పెద్దలు కూడా

వాక్యమును నేర్పించుదురు. సంఘము క్రమముగా ఈ పరిచర్యకు ఆర్థిక సహాయము చేయుచున్నది. ఇందులో తర్బీదు పొందిన కొందరు ఉత్తర భారతదేశములోను తెలంగాణా జిల్లాలలోను, రాయలసీమ, కోస్తా ఆంధ్ర జిల్లాలోను సంఘముల సిఫారసుతో పనిచేయుచున్నారు.

18) ఈ సంఘ పరిచర్య ద్వారా శ్రీ క్రిష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ప్రాంగణములో బేతస్థ అసెంబ్లీ అనుపేరుతో ఒక సంఘము 1992 నుండి కొనసాగుచున్నది. 2003లో స్థిరమైన కట్టడము కట్టబడి ప్రతిష్ఠంచబడినది. ఆదివారము 100-150 మంది వరకు కూడుదురు. ప్రతి గురువారము విద్యార్థి, విద్యార్థినులకు బైబిల్ పారాయణము, విద్యార్థినులకు ప్రత్యేకముగా ప్రతి శుక్రవారము బైబిల్ పారాయణము జరుగును.

19) గాస్పల్ అసెంబ్లీ పబ్లిషింగ్స్ పేరుతో బైబిల్ గ్రంథ ధ్యానములు ప్రచురించబడుచున్నవి.

20) గాస్పల్ అసెంబ్లీ ట్రస్ట్ ఫర్ ఎవాంజలిజమ్ పేరుతో 30 మంది సువార్త సేవకులకు సహాయము క్రమముగా పంపబడునచున్నది.

21) సంఘ రాబడి నుండి రమారమి 20 మంది సేవకులకు, రెండు అనాధ ఆశ్రమములకు, అసెంబ్లీ బిలీవర్స్ సొసైటి ఫండుకు క్రమముగా సహాయము పంపబడుచున్నది.

22) ఈ సంఘము ద్వారాకొన్ని సంవత్సరములురేడియోలో సువార్త ప్రకటన జరిగినది.

23) ప్రతి సంవత్సరము రెండు పర్యాయములు సువార్త ఎక్కువగా ప్రకటింపబడని తెలంగాణా జిల్లాలకు వెళ్లి సువార్త ప్రకటన

చేయబడుచున్నది. దాని ఫలితముగా తెలంగాణాలో 10 సంఘములు ఏర్పడినవి.

24) ఈ సంఘము యొక్క కృషిద్వారా బైబిల్ సొసైటీ పరిచర్యలో చాలా మేలు కలిగినది. జోసఫ్‌గారు బైబిల్ సొసైటీ ఆగ్జిలరీ కమిటీ మెంబరుగా ఎన్నుకొనబడి పది సంవత్సరములు సభ్యులుగా నుండిరి. కాథలిక్ వారితో కలసి బైబిల్ తెనిగించవలెనని, అందుకుగాను అపోక్రిపా అను అప్రమాణ గ్రంథములను బైబిల్‌లో చేర్చవలెనన్న విశ్వప్రయత్నము జరుగగా జోసఫ్ గారు పోరాడి దానిని నిలుపుచేయుటకు ముఖ్య పాత్ర వహించిరి.

25) ప్రతి సంవత్సరము బ్రదరన్ అసెంబ్లీస్ అనంతపురం జిల్లా పేరుతో అతి తక్కువ ధరకు దేవుని వాక్యపు కాలండర్లు తయారుచేయబడి జిల్లా అంతటికి అందించబడుచున్నవి.

26) అనంతపురం పట్టణమందు ప్రతిదినము పత్రికలు పంచు పరిచర్య గతములో ప్రభువు నందు నిద్రించిన (1) స్థానిక సంఘ పెద్దయగు పి. జోసఫ్ గారు (2) పి. ఇమ్మానుయేలు గారు చేయుచుండిరి. ఇప్పటికిని ఈ పరిచర్య పి. ఇమ్మానుయేలు గారి ద్వారా జరుగుచున్నది. బైబిల్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రతి బుధవారము సాయంత్రం పత్రికలు పంచుచున్నారు. పి. ఇమ్మానుయెలు గారు ప్రభుత్వ ఉద్యోగము చేయుచు, ప్రతి సంవత్సరము ఒక నెల సెలవు తీసుకొని ఉత్తర భారతదేశములోని పలు రాష్ట్రములకు ఒక్కొక్కసారి ఒక రాష్ట్రమునకు వెళ్లి సువార్త సేవచేయుచు కరపత్రములు పంచుచున్నారు. అనంతపురం చుట్టుపట్ల గ్రామములందు మోటారు సైకిలుకునకు మైకు అమర్చుకొని సువార్త ప్రకటన పత్రికలు పంచు పరిచర్య జరిగించుచున్నారు.

27) ఈసంఘ పరిచర్య ద్వారా రక్షించబడి ఆత్మీయముగా బలపడిన వారిలో ఐ.ఎ.ఎస్ అధికారులు, జడ్జిలు, ఇంజనీయర్లు, డాక్టర్లు పోలీసు అధికారులు, వ్యాపారస్తులు అన్ని వర్ణములకు చెందినవారు కలవు.

సహోదరులు టి.పి. వరప్రసాద రెడ్డి గారు స్వచ్ఛంద పదవీవిరమణ తీసుకొని స్థానిక సంఘములో వారి సతీమణి కెజియాతో 1999లో సేవకు ప్రత్యేకించబడి స్థానిక సంఘములో సేవకులుగా నున్నారు.

స్థానిక సంఘములో సేవచేయుచూ, వరప్రసాద రెడ్డి గారు ఆయా స్థానిక సంఘములను దర్శించుచూ అనంతపురం స్థానిక సంఘము తరపున బైబిల్ ఇనిస్టిట్యూట్ బాధ్యత నిర్వహించుచున్నారు. అటువలెనే సోదరీమణి కెజియా స్థానిక సంఘములో సేవచేయుచు ఆంధ్ర, కర్నాటక రాష్ట్రములలోని సంఘములను దర్శించుచూ, సోదరీమణులమధ్య వాక్యోపదేశము చేయుచున్నారు.

ప్రస్తుతము సంఘములో జి.యస్. జోసఫ్‌గారు సంఘసేవకులు గాను, పెద్దగాను మరియు పి. అబ్రహాముగారు వై. యేసుదాసుగారు, డి. మోహనరావుగారు పెద్దలుగా ఉన్నారు. టి.పి. వరప్రసాదరెడ్డి గారు సువార్త సేవకులుగానున్నారు.

ఈసంఘ సహవాసము నుండి సేవకై ప్రత్యేకించబడినవారు:

1) పాల్‌గుప్తగారు **(1939):** ప్రొద్దుటూరు వాస్తవ్యులు, వైశ్యులైన పాల్ గుప్త గారు రక్షింపబడిన పిదప అనంతపూర్ సంఘ సహవాసములో ఏడు సంవత్సరములు కొనసాగి తదుపరి ఉత్తర భారతదేశములోని ఖరగ్‌పూరులోను, మద్రాసులోను సేవచేసి ప్రభువు నందు నిద్రించిరి. మద్రాసు పట్టణములో హిందూస్థాన్ బైబిల్ ఇన్‌స్టిట్యూట్ స్థాపించి అనేక మంది సువార్త సేవకులకు తర్ఫీదు నిచ్చి ముఖ్యముగా ఉత్తర ఇండియాకు సేవకులుగా పంపిరి. అప్పట్లో భారత దేశమందలి బైబిల్

కాలేజీలన్నిటిలో ఇది పెద్దదిగానుండెను. అక్కడ చదివిన వారు అనేక బైబిల్ కాలేజీలను స్థాపించిరి.

2) **యస్. ప్రభుదాస్‌గారు నంద్యాల (1940):** వీరు పులివెందులలో మొదట క్రైస్తవులైన సందింటి వెంకటరెడ్డి గారి కుమారులు. రక్షించబడిన పిదప అనంతపురమునకు వచ్చి ఈ సంఘసహవాసముందు ఐదు సంవత్సరములుండిరి. ఇక్కడ నుండి సువార్తసేవకై బళ్లారికి, తరువాత నంద్యాలకు వెళ్లిరి. రమారమి 70 ఏండ్లు ఆంధ్రప్రదేశ్ లోను, ఇతర రాష్ట్రములలోను మాదిరికరమైన సేవ జరిగించుచున్నారు.

3) **జి.యస్. జోసఫ్‌గారు అనంతపురం (1944) :** వీరి తండ్రియగు శ్రీ జి. జేమ్సు గారు ఇండియా గవర్నర్ జనరల్‌చే "రావుసాహెబ్"గా బిరుదుపొంది అనంతపురంలో జిల్లా ట్రెజరీ ఆఫీసర్‌గా పనిచేయు చుండి 1936 నుండి ఈ సంఘ సహవాసమందుండిరి. అందువలన మద్రాసులో చదువుచుండిన జోసఫ్‌గారు నూతనముగా రక్షించబడిన పిదప ఈ సంఘమును నడిపించుచుండిన అగ్రిప్పగారికి, ఫాక్స్ గారికి పరిచయమైరి. అదే సమయములో అనంతపురంలో డిస్ట్రిక్ట్ బోర్డు ఇంజనీయరుగా పనిచేయుచూ స్థానిక సంఘ సహవాస మందుండిన పి.సి. పొన్నన్ గారు ఆత్మీయముగా జోసఫ్ గారికి సహాయపడిరి. జోసఫ్ గారు 1944లో ఫాక్సు గారి ఆహ్వానము మేరకు ప్రభువు పిలుపుకు లోబడి అనంతపురంలో వారి సతీమణితో కూడా సేవకు వచ్చి 2005 సం॥ వరకు గత 61 సంవత్సరాలుగా ఈ సంఘ సేవలో కొనసాగుచున్నారు. వీరు మ్యాజిక్ లాంతరుతోను క్రీస్తు చరిత్ర సినిమా ద్వారా సువార్త ప్రకటించిరి.

4) **ఐజక్ అబ్రహాముగారు బిట్రగుంట (1944):** నెల్లూరు జిల్లా వాస్తవ్యులైన ఐజక్ అబ్రహాముగారు రక్షించబడి అనంతపురంనకు వచ్చి ఈ సంఘ సహవాసమందు పెరిగి సేవకొరకు 1944లో బిట్రగుంటకు వెళ్లి నెల్లూరు జిల్లాలో గొప్ప సేవ చేసి ప్రభువు నందు నిద్రించిరి.

5) నాయుడుపేట జాకబ్ గారు (1944): వీరు రక్షింపబడిన పిదప అనంతపురంనకు 1943లో వచ్చి ఈ సంఘ సహవాసమందుండిరి. తదుపరి నాయుడు పేట వెళ్లి సేవచేసి ప్రభువు నందు నిద్రించిరి.

6) పి.వి. దేవశిఖామణిగారు ఉజ్జయిని (1960): వీరు అనంతపురం వాస్తవ్యులు. వైమాణికదళములో (ఆర్.ఎ.ఎఫ్) 15 సంవత్సరములు పనిచేసిరి. రక్షించబడిన పిదప ఈ సంఘ సహవాసమందున్న సమయంలో ఉత్తర ఇండియా సేవకు 1960లో పంపబడిరి. నేటికిని సేవలో కొనుసాగుచున్నారు.

7) రౌతాంగ్లిస్ మూర్ గారు (1973): వీరు ఐ.ఎ.యస్. అధికారియై అసిస్టెంటు కలెక్టరుగా అనంతపురంలో ట్రెయినింగ్ పొందుచు ఈ సంఘమందు 1970లో బాప్తిస్మము పొంది రెండు సంవత్సరములు సంఘ సహవాసమందుండిరి. తాను చిన్న నాట దేవునికి సేవ చేయుదునని చేసిన ఒప్పందమును జ్ఞాపకము చేసికొని సబ్-కలెక్టర్ పనికి రాజీనామా ఇచ్చి అస్సాం రాష్ట్రములోని డిప్పు పట్టణము నందు ఆస్పత్రిని, స్కూలును స్థాపించి గత 32 సంIIగా ప్రభువు సేవ చేయుచున్నారు.

8) వరప్రసాదరెడ్డి గారు (1999): వీరు 1964లో ప్రభువును రక్షకుడుగా అంగీకరించి 1964 నుండి నేటివరకు సంఘ సహవాసములో కొనసాగుచున్నారు. 1999లో ప్రభువు పిలుపును అంగీకరించి విద్యుత్ శాఖలో తాను చేయుచుండిన డివిజనల్ ఇంజనీయర్ పనిని స్వచ్ఛందంగా విరమించుకొనిరి. ఈ స్థానిక సంఘము ద్వారా ప్రభువు సేవకు వీరి సతీమణితో కూడా 1999లో అప్పగింపబడిరి. ఉద్యోగములో వున్న దినములలోను, సేవకై ప్రత్యేకించబడిన దినములలోను ఆయా పట్టణములలో సువార్త ప్రకటించి క్రొత్త నిబంధన పద్ధతిలో సుమారు 40 స్థలములలో సహోదరుల సహకారముతో సంఘములు ఏర్పడుటలో ప్రయాసపడుచున్నారు.

సుమారు 30 స్థలములలో మందిర నిర్మాణములకు ప్రయాసపడిరి.

9) **జోబ్‌దాస్ డేవిడ్ గారు హైదరాబాద్ (1999):** వీరు సంఘ పెద్దయగు పి. అబ్రహాము గారి చివరి కుమారుడు. రక్షింపబడిన పిదప ఇంజనీరింగ్‌లో పట్టబద్రుడై అనంతపురంలో ఉద్యోగముచేయుచు ఈ సంఘ సహవాసములో పది సంవత్సరములు సండే స్కూలులో సేవచేసిరి. వివాహమైన పిదప పదవి విరమించి వీరి సతీమణి ఆనీ తోకూడా ఈ సంఘమందు 1999 లో ప్రభువు సేవకు ప్రత్యేకించ బడిరి. హైదరాబాద్ పట్టణమందు అమీర్‌పేట ఏరియా శ్రీనగర్ కాలనీలో ప్రభువు సేవ చేయుచు ఇతర సహోదరుల సహకారముతో డివైన్‌లైట్ క్రిష్టియన్ అసెంబ్లీ అను సంఘమున ఏర్పరచి కొనసాగుచున్నారు. తెలంగాణా జిల్లాలలో ప్రతి సంవత్సరము మండలముల వారిగా సువార్త ప్రకటించు కార్యమును జరిగించు చున్నారు.

10) సహోదరులు రాజబెంజమిన్ గారు, కె. డేవిడ్ గారు ప్రభువు సేవకు 1999లో సంఘము ద్వారా ప్రత్యేకించబడిరి.

11) **సహో విజయగారు టౌన్ కాంగ్రిగేషన్ చర్చి అనంతపురం:** వీరు రక్షించబడిన పిదప ఈ సంఘమందు బాప్తిస్మము పొంది సహవాసమందు ఎదుగుచూ అనంతపురం పాలిటెక్నికల్ కాలేజీలో ఇంజనీరింగ్ విద్యనభ్యసించిరి. ప్రభువు పిలుపు మేరకు ఆయా పట్టణములలో నమ్మకమైన సేవచేసి అనంతపురం టౌన్ కాంగ్రిగేషన్ చర్చిలో గత 10 సంవత్సరముల నుండి సంఘకాపరిగానున్నారు.

<u>ప్రభుత్వ వివిధ శాఖలలో అనంతపురంలో పనిచేయుచు, ఈ సంఘ సహవాసమందుండి ఇతర ప్రాంతములకు వెళ్ళి సేవచేసిన వారి వివరములు:</u>

1) **యస్. శామరాజు గారు జమైకా (యు.యస్.ఏ):** వీరు 1945-1960 వరకు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో మేల్ నర్సుగా పనిచేయుచు

ఫాక్సు గారి పరిచర్య ద్వారా రక్షణ పొంది, బాప్తిస్మము పొంది ఈ సంఘ సహవాసమందుండిరి. పదవీవిరమణ తరువాత అమెరికా దేశములోని జమైకాలో నివాసము చేయుచు ప్రాజెక్టు క్రైస్టును ఇతరదేశములోను, ఈ దేశములలోను స్థాపించి మనదేశములో అనాథ శరణాలయాలను, ఆస్పత్రిని బైబిల్ స్కూలును స్థాపించి సేవ చేయుచున్నారు.

2) టి. రామలింగారెడ్డిగారు, రిటైర్డు ఛీఫ్ ఇంజనీయర్ హైదరాబాదు: వీరు రక్షించబడి ఇంజనీరింగ్ విద్య చదువు నప్పుడును, ఉద్యోగము చేయునపుడును ఈ సంఘ సహవాసమందుండిరి. 1972లో బదిలీపై కడపకు వెళ్లి సహోదరుల సహకారముతో స్థానిక సంఘ సాక్ష్యమును ఏర్పరచిరి. కడప జిల్లా సేవ విస్తరించుటలో కృషిచేసిరి. మరొకసారి 1989 లో అనంతపురం నుండి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తికి బదిలీపై వెళ్లిరి. సహోదరుల సహకారముతో వనపర్తిలో స్థానిక సంఘ సాక్షముగా ఏర్పరచిరి. ప్రస్తుతము హైదరాబాద్‌లో ఉంటూ మహబూబ్‌నగర్ జిల్లా సేవ విస్తరణకై పాటుపడుచున్నారు.

3) ఓ.టి. జేమ్సుగారు, రిటైర్డ్ డివిజనల్ ఇంజనీయరు విజయవాడ: వీరు అనంతపురంలో ఇంజనీరింగ్ విద్యనభ్యసించునపుడు ఈ సంఘ సహవాస మందుండిరి. విజయవాడలో చాలాకాలము పనిచేసిరి. విజయవాడ పట్టణములోను, ఇబ్రహీమ్‌నగర్ థర్మల్‌స్టేషన్‌లోను సంఘ సాక్ష్యము ఏర్పడుటలో సహోదరుల సహకారముతో ప్రయాసపడిరి. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాలో మండలముల వారిగా సువార్త సేవ జరిగించుటలో భారముకలిగి కృషిచేయుచున్నారు.

4) సహో॥ వేదమూర్తిగారు రిటైర్డ్ డివిజనల్ ఇంజనీయర్ విజయవాడ: వీరు అనంతపురంలో ఇంజనీయరింగ్ చదువు దినములలో రక్షింపబడి ఉద్యోగరీతిగా విజయవాడలో ఇంజనీయర్‌గా చాలాకాలము పనిచేసిరి. ఇబ్రహీమ్ పట్టణ మందలి థర్మల్‌స్టేషన్‌లో సంఘస్థాపనలోను, సేవ విస్తరణలోను సహోదరుల సహకారముతో కృషిచేయుచున్నారు.

5) అవనిగడ్డ మురళీకృష్ణప్రసాద్ ప్రొఫెసర్ ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల హైదరాబాద్: అనంతపురం నందు ఇంజనీరింగ్ చదువు చున్న సమయంలో హైందవకుటుంబమునకు చెందిన వీరు 1972లో యేసు ప్రభువును రక్షకుడుగా అంగీకరించి నాలుగు సంవత్సరములు సంఘ సహవాసమందుండిరి. ప్రస్తుతము ఉద్యోగ రీతిగా హైదరాబాద్‌లో వున్నారు. హైదరాబాద్ పట్టణమందు ప్రాంతముల వారిగా వీధులలో కొన్ని సంవత్సరములు సువార్త ప్రకటించిరి. బైబిల్ స్కూలు నడిపించి కొద్దిమందికి తర్ఫీదు నిచ్చిరి. స్థానికముగా ఒక సంఘ సాక్షము ఏర్పరచి సేవ చేయుచున్నారు.

6) పి.వి.బి. వీరాంజనేయులు. డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ హైదరాబాద్: వీరు హైందవ కుటుంబమునకు చెందినవారు. అనంతపురములో ఇంజనీరింగ్ విద్యనభ్యసించు సమయమున 1973 ప్రభువును రక్షకుడుగా నమ్మి నాలుగు సంవత్సరములు ఈ సంఘ సహవాసమందు బలపడిరి. బంధువుల నుండి అనేక తొందరలను అనుభవించిరి. ఉద్యోగరీతిగా హైదరాబాద్‌లో నుండగా కొన్ని సంవత్సరములు పట్టణమందలి అనేక వీధులలో సువార్త ప్రకటించిరి. ప్రస్తుతము హైదరాబాద్‌లో చందానగర్‌లో సంఘ సాక్ష్యము ఏర్పరచి దాని నిర్వహణలో బాధ్యత కలిగియున్నారు.

7) సత్యపాల్ మనేష్‌గారు ప్రొద్దుటూరు: వీరు అనంతపురంలో సంఘ సహవాసమందు రక్షింపబడి ఆత్మీయముగా ఎదిగిరి. ఉద్యోగరీతిగా కడపలోను, ప్రొద్దుటూరులోను ఉండగా కడపజిల్లా ఎర్రగుంట్లలో సంఘ సాక్ష్యము ఏర్పడుటలో కృషిచేసిరి. నేటికిని సంఘ అభివృద్ధికై పాటుపడుచున్నారు.

8) కె. జోసఫ్ గారు ముద్దనూరు థర్మల్‌స్టేషన్: వీరు అనంతపురం సంఘ సహవాసములో రక్షించబడి బలపడిరి. ఉద్యోగరీతిగా ముద్దనూరు థర్మల్ స్టేషన్‌లో పనిచేయుచున్నారు. థర్మల్‌స్టేషలో సంఘ సాక్ష్యము

ఏర్పడుటలో సహోదరుల సహాయముతో కృషిచేసి నేటికిని సంఘ అభివృద్ధికై పాటుపడుచున్నారు.

9) యం. ఇమ్మానియేలు బాబుగారు, గచ్చిబౌలి, హైదరాబాద్ :

వీరు అనంతపురంలో ఈ స్థానిక సంఘమందు రక్షించబడి ఆత్మీయులుగా బలపడిరి. ఉద్యోగ రీతిగా హైదరాబాద్‌లో ఉండగా సహోదరుల సహకారముతో గచ్చిబౌలిలో సంఘ సాక్ష్యము ఏర్పడుటలో కృషిచేసిరి. నేటికిని అక్కడ సేవ విస్తరణలో పాటుపడుచున్నారు.

10) సత్యనారాయణ గారు, రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీయరు హైదరాబాదు: వీరు 50 ఏండ్ల వయసులో విగ్రహములను విడిచి క్రీస్తును రక్షకుడుగా అంగీకరించి ఈ సంఘమందు బాప్తిస్మము పొంది ప్రస్తుతము హైదరాబాద్‌లో సంఘ సేవలో పాల్గొనుచున్నారు.

----

*"మాకుకాదు, యెహోవా మాకు కాదు నీ కృపాసత్యములను బట్టి నీ నామమునకే మహిమ కలుగును గాక" కీర్తన **115:1***

*"నేను **(మేము)** ఏమైయున్నానో **(మో)** అది దేవుని కృపవలనే అయి యున్నాను" **(ము) 1** కొరింథి **15:10***

*మీలో ఈసత్క్రియ నారంభించిన వాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించుననని రూఢిగా నమ్ముచున్నాను. ఫిలిప్పీ 1:6*

**1) పి. అబ్రహాము గారు, 2) వై. యేసుదాసుగారు,**

**3) డి. మోహనరావు గారు, 4) జి.ఎస్. జోసఫ్ గారు,**

**5) టి.పి. వరప్రసాద రెడ్డి గారు**




గాస్పల్ అసెంబ్లీ పబ్లిషింగ్స్
7-270 కోర్టురోడ్డు, అనంతపురం - 1,
ఫోన్ : 08554 275070.